కథానిక

# మానవుడూ-మొగలీ

"ప్రభు"

"సార్! మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు."

రేడియోలాగ ప్రకటించి వెళ్ళిపోయాడు బంట్రోతు. కాలుస్తూన్న సిగరెట్టు త్వరగా నాలుగు దమ్ములులాగి, ఒకసారి అద్దంలో బట్టలు సవరించుకుని ఛీఫ్ రూముకి నడిచాడు ప్రకాశరావు—నడుస్తోంటేనే అతనికి పరిస్థితిలో ప్రత్యేకత బోధపడింది—తనని ఏదో ప్రత్యేకంగా కని ఉండే పిలిచాడు ఛీఫ్. ఎందుకో!

తినబోయి రుచిగురించిలాగ ఆలోచన ఎందుకులే అని సరిపెట్టుకుని మెట్లెక్కేడు. కాని వెయ్యి ప్రశ్నలు — తనని ఎక్కడికైనా డిప్యూట్ చేస్తాడా?... లేక ఏదైనా పొరపాటు చేసినందుకు తిడతాడా?... తానిక్కడికి వొచ్చి ఆరునెలలు దాటినా, ఆ మనిషి తత్వం మాత్రం అర్థంకాలేదు!

ఆలోచిస్తూనే లోపలికి వెళ్ళేడు. తల వొంచుకుని చదువుతూన్న రాజారావు "కమిన్" అంటూనే పుస్తకం క్రిందని పడేసి కుర్చీచూపెట్టేడు.

కొంచెంసేపు ఇద్దరూ ఏమీ మాటలాడలేదు.

"నువ్వు చాలా బుద్ధిమంతుడివని నా ఫర్మ్‌లోకి తీసుకున్నాను" అన్నాడు ఛీఫ్—రాజారావు.

ఇదేదో పీకలమీదికి వొచ్చే వ్యవహారంలాగ తెలిసిన ప్రకాశరావు జాగ్రత్తగా వినసాగాడు. తలమీద విపరీతంగా తిరుగుతూన్న ఫేన్ ఒక్కసారి గాలితో అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

"అవునండి" అన్నాడు ప్రకాశరావు సమాధానంగా.

"ఆ అభిప్రాయం నిలబెట్టుకోవడం అవసరం కదూ?"

కొంచెం కోపంగా వొచ్చిన మాటలు విని, "అవును" అన్నాడు ప్రకాశరావు మళ్ళా.

"అయినా ఇక్కడ నీపని నువ్వు చూసుకోక నీ ప్రేమవ్యవహారాలన్నీ మొదలుపెడితే అది మన ఇద్దరికీ మంచిది కాదు."

పిడుగుపడినట్టు చూశాడు ప్రకాశరావు. ఒక్క క్షణంలో ఈ ఆరునెలలనించీ ఇక్కడి తన జీవితం అతని మనస్సులో మెదిలింది. గిరిజ, విక్టోరియా, ప్రభ, మెహర్ అందరితోనూ తన పరిచయం అతను జ్ఞాపకం చేసుకున్నాడు. మనసొత్తలాగినా, తలబరువుని ఉపయోగించి ఇన్నాళ్ళూ తాను జాగ్రత్తగా ఉంటూవచ్చాడు—ఇప్పుడీ ప్రమాదం వొచ్చేలా ఏం చేశాడు తను?

"మిస్టర్ రావ్!... ఆడవాళ్ళంటే కొంచెం గౌరవం, మర్యాదా ఉండాలి. ఇక్కడ మనమందరం ఏదో ఒకలాగ జీవితం గడిపే ప్రయత్నంలో వొచ్చాం. ఎవరి ఉద్దేశాలు వాళ్ళు ఉంచుకుని, తలలు వొంచుకుని వెడితే అందంగా ఉంటుంది. కాని, ఈ రకంగా తుంటరిపనులు చేస్తే రేపు ఉద్యోగానికి విరమించుకోవాలి" అని ఉపన్యసించాడు రాజారావు.

తడబడుతూ, "సారీసర్—నాకేమీ తెలియదు. ఏదో పొరపాటు జరిగి ఉండాలి" అన్నాడు ప్రకాశరావు. ఈ ఉద్యోగంమీద తన బ్రతుకూ, ఇంట్లోవాళ్ళ జీవితమూ ఆధారపడి ఉందని తనకి తెలుసు—ఎంతమంది కాళ్ళుపట్టుకుని తానుగుమాస్తా ఉద్యోగం కోసం గౌరవాన్ని చంపుకున్నాడో తనకి తెలుసు...

"ఎందుకు దాపరికం రావ్!—పెళ్ళి అయిన మనిషివికదా!...కొంత కాలం ఉండాలి. నువ్వూ, ఆడపిల్లలని అల్లరిచేస్తే..."

భరించలేక, "నేనట్లా ఏం చెయ్యలేదు!" అన్నాడు ప్రకాశరావు.

"నాకు తెలుసుగా!...కాగితాలిచ్చేటప్పుడు అమ్మాయిలకి చేతులు తాకించాలా?...తలవొంచుకుని పని చేసుకోక, అస్తమానం వాళ్ళ మొహాలలోకి చూడాలా? ఇంటికి పోతూంటే గేటుప్రక్కన నిలబెట్టి పలకరించాలా? ఇవన్నీ పిచ్చికన్ను కాక పోతే మరేమిటి?"

"దేవుడా!" అనుకున్నాడు ప్రకాశరావు. కాగితాలు ఇచ్చేటప్పుడూ పుచ్చుకునేటప్పుడూ తాను అజాగ్రత్తగా ఉండేవాడు—మరీ కులాసాగా ఉండడంవల్ల వొచ్చే ప్రమాదాలు తెలుసుకోక ఈ స్టెనోలతో కబుర్లుచెప్పి పీకలమీదకి తెచ్చుకున్నాడు...

"నయం!—సిగ్గుపడుతున్నావు! ఆ అమ్మాయి మొదటిసారి కంప్లెయింట్ చేసింది కనక తేలికగా పోనిస్తున్నాను తిరిగి ఇట్లా నిన్ను గురించి వింటే నీకు నోటీస్ ఇవ్వాల్సి వొస్తుంది—"

"ఎవరు కంప్లెయింట్ చేశారండీ?"

"ఏం!—వెళ్ళి అడుగుతావా?"

పొరపాటు చేశానని తెల్సుకుని నెమ్మదిగా లేచాడు ప్రకాశరావు వెళ్ళడానికి.

"నేను చెప్పినది జ్ఞాపకం ఉంటుందిగా!—వెళ్లు."

బరువుగా మెట్లు దిగాడు ప్రకాశరావు. తన మీద ఫిర్యాదు!—ఒక అమ్మాయి ఈ వృద్ధజంబుకం అదంతా నమ్మి తనకి కీడు తెచ్చేలా ఉన్నాడు... ఎవరు ఫిర్యాదు చేశారో!

క్రింద హాల్లో మొదట ప్రభ కనిపించింది, తన వొంక సీరియస్‌గా చూసి తిరిగి తన వర్కులో మునిగిపోయింది...ప్రభ ఇలాగ చేసిఉంటుందా!... తనకీ ముగ్గురు స్టెనోలతోనూ చనవే!... ఈమే ఫిర్యాదు ఇచ్చిఉంటే...

ఆమె గాంభీర్యంచూసి కొణికిపోయాడు ప్రకాశరావు. నిజం...ఆమే...ఒకసారి ఆమెకీ తన చేతులు తగిలినట్లు జ్ఞాపకం...ఇవాళ తాను నేరస్థుడు...

ఆమెకి కొద్దిదూరంలో కూర్చున్న గిరిజ తనని చూసి చిరునవ్వు నవ్వింది—ఏదో వెక్కిరిస్తోన్నట్లు, ఒక్కసారి తనకి తెలిసినట్లయింది. "అయిందా అబ్బాయిగారి పెళ్ళి!" అంటోన్న నవ్వు. గిరిజ తననిచూసి ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. ఆ నవ్వులో ఏదో అందం ఉందనీ, అందులో ఆనందం ఉందనీ. ఆమె నవ్వు వెన్నెలమల్లే ఉంటుందనీ అనుకునేవాడు తను. ఆ ఉద్రేకంలో తనకి తెలియకుండానే ఈ పైత్యపుపన్ను చేసిఉంటాడు. ఇవాళ తనలోని కల్మషాన్ని గిరిజ ఛీఫ్ దగ్గరచెప్పి, తనని చీవాట్లు పెట్టించి, తనని చూసి నవ్వుతోంది! నిస్సందేహంగా ఈ ఫిర్యాదీ గిరిజే ననుకున్నాడు ప్రకాశరావు. ఎంత అసహ్యంగా నవ్వుతోంది తననిచూసి!

సీటులో కూలబడ్డాడు నిస్సహాయంగా. మెహర్ అతన్ని కట్టికట్టి చూసి, "ఏం మిస్టర్ రావ్! ఏం జరిగింది!" అన్నది.

"ఏమీ లేదు" అన్నాడు.

ఏంజరిగింది!—లక్షణంగా తనదారిని తను పోతోంటే వీళ్ళలో ఒకరు తనని నవ్వులపాలు చేశారు!... మెహర్ వీళ్ళందరిలోకీ దొంగ—అంత మోసం మరెవరూ చెయ్యలేరు—ఒకవేళ...

నీరసంగా ఆమెవైపు చూశాడు తిరిగి. ఆమె ఇందాకటి మనిషి కాదన్నట్లు తన పని చేసుకుపోతోంది—తానక్కడ లేనట్టు... ఈ రకం మనుషులే ఎంత దగా అయినా చేసేవాళ్లు...

విక్టోరియా...

ఆ అమ్మాయి తనతో అసలు మాట్లాడదమే పెద్ద ఉపకారంలాగ ఉంటుంది. వీళ్ళందరూ తనతో విరగబడి నవ్వుతూంటే ఆమె మహా గంభీరంగా ఊరుకుని తనని పురుగుని చూసినట్టు చూస్తుంది. తాను వీళ్ళందరికీ Favourite. అదే ఆమెకి వొళ్లు మంట.

ఎన్నోసార్లు విక్టోరియాని కూడా ఈ జాబితాలో చేర్చాలని ప్రయత్నించాడు ప్రకాశరావు. అయినా ఆమె సింహాసనం దిగిలేగా!

అతని పాటుచూసి మిగిలినవాళ్లెవరూ అతన్ని పలకరించలేదు. ఆ ఫూటకింక పని ఏమీ చెయ్యలేకపోయాడు ప్రకాశరావు.

అతను స్వతహాగా చాలా కులాసా మనిషి. ఈ స్టెనోలకి తాను ప్రియమిత్రుడు. ఎప్పుడో వీళ్ళతోనూ, ఇతర గుమాస్తాలతోనూ నవ్వుతూ కాలక్షేపం చెయ్యడానికి అలవాటుపడిపోయాడు. ఇవాళ ఫిర్యాదుతో తనకీ ఫర్మ్‌లో ఉన్న గౌరవం ఆనందం—అన్నీ పోయాయి.

ఎవరు!—ఇదంతా ఎవరు చేశారు?

అయిదు అవగానే ఆఫీసునించి అందరూ వెళ్ళిపోతున్నారు. విక్టోరియా హఠాత్తుగా తనవొంక చూసి గిరిజతో ఏమో అంది. ఇద్దరూ నవ్వుకున్నారు.

హఠాత్తుగా అంతా తెలిసిపోయింది తనకి ఇదంతా ఆ వాసుగాడి దొంగ ప్రణయలేఖ

మహిమ అయి ఉండాలి. తనంటే వాడికి కిట్టదు. ఆమెకీ తన పేరున...

కాఫీత్రాగి పార్కులో కూర్చున్న ప్రకాశరావుకి ఆలోచించినకొద్దీ ఈ చరిత్రకి కారకురాలు విక్టోరియా అని నిశ్చయంగా కనిపించసాగింది. చీఫ్ చెప్పిన కొన్ని వికారాలు తాను తెలుసుకోకుండా చేసే ఉంటాడు—లేదా వాసు ప్రణయలేఖని చూపకుండా, కొంచెం జాగ్రత్తపడమని ఆమె ఇలాగ చేసి ఉండాలి.

"గాడ్!" అనుకున్నాడు బుర్రపట్టుకుని. ఆమె ఈ కథ అందరికీ చెప్పేస్తోంది. తన బ్రతుకు నవ్వులపాలు అయిపోతోంది!...విక్టోరియా...వాళ్ళందరిలోకీ అంపగత్తె అనుకునేవాడు తాను. అందుకనే ఆమె తనని అంత చీదరించుకున్నా ఆమె స్నేహం కోసం,సాన్నిహిత్యంకోసం ప్రయత్నించడం. ఆమే ఇదంతా చేసింది!

గిరిజ మరీ సాదామనిషి. ఆమె ఇంత పనిచేసి ఉంటుందని అనుకోడానికీ వీలులేదు. ప్రభ మరీ మంచిది. మెహర్‌లో అంత ధైర్యం ఉండదు. నిస్సందేహంగా అది విక్టోరియాపనే!

మర్నాడు ఉదయం తాను ఆఫీసుకి వెళ్ళేసరికి అందరికీ ఈ పని తెలిసిపోయి ఉంటుందని తనకి తెల్సు. ఇంతదాకా తెచ్చిన విక్టోరియా అది దాచదుగా! తొందరగా లేచి రూమ్‌కివెళ్ళి కాగితం తీసి, తన రాజీనామా రాసేడు ప్రకాశరావు. ఇంకా ఇంకా అవమానం పొందాక ఈ ఉద్యోగం వొదులుకోవడం కన్న ఇప్పుడే ఒదులుకుని ఆ పరువు దక్కించుకోడం మంచిది కాదూ!

ఉత్తరం జేబులో పెట్టుకుని రాజారావు ఇంటివైపు నడిచాడు. కనుచీకటి పడుతోంది. విద్యుద్దీపాలు మరీ నీరసంగా వెలగడాన్న కళ్ళకేమీ బాధ కలగడంలేదుకాని, వెలవెల బోతోన్న కాంతులు మనస్సుని మరీ ఏడిపించ సాగాయి.

తిరిగి తాను ఉద్యోగప్రయత్నాలు చెయ్యాలన్నీ, ఈ కథ అంతా తెలిస్తే భార్యకి కూడా తనమీద అభిమానం పోతుందని అతనికి తెలుసు—కాని, ఇంతకన్న వేరే చెయ్యదగినది లేదు.

నాలుగు వీధులుదాటి అనుకోకుండానే ఆ వీధిలోకి వొచ్చాడు ప్రకాశరావు. విక్టోరియా ఇల్లా ఆ వీధిలోనేనని అతనికి తెల్సును. హఠాత్తుగా అతనికి తలలోకి ఒక ఆలోచనవొచ్చింది..సర్వనాశనం అయిపోతోన్న ఈ సమయంలో, దీనికంతకీ కారకురాలైన ఆమెమీద కసి తీర్చుకోవడం...

గేటు తీసుకుని లోపల అడుగుపెట్టేడు.

కుక్కపిల్ల అరుస్తూ కొంప మునిగినట్లు గోల చెయ్యసాగింది. దాంతో ప్రకాశరావుకి మరీ కోపం వొచ్చింది. ఇంతట్లో విక్టోరియా వొచ్చి దాన్ని ఊరుకోబెట్టి, "ఎవరు?" అంది, దగ్గరగా వొస్తూ.

మసక కాంతుల్లో ఆమెకి తాను కనపడటం లేదు బాగా—కాని, తనకామె మూర్తీభవించిన రాక్షసళ్వలాగ కనిపిస్తోంది.

ఒక్కసారి ఆమెని రెండు చేతుల్లోనూ బాదివి పట్టుకుని దగ్గరగా తీసుకున్నాడు ప్రకాశరావు. అంతకన్న ఆమెకి తాను చెయ్యగలిగిన అవమానం ఏమీఉండదని తనకి తెలుసును. ఆమె గింజుకుంటుంది-విడిపించుకునితనని తిడుతుంది- అదంతా అతనికి తెల్సు...అప్పుడు ఆమెని చూసి నవ్వాలి.

కాని-ఆమె తన మెత్తటి చేతులు అతని మెడమీద వేసి ఆప్యాయంగా తన వైపు తీసుకుంటుంది. అతని పెదవులకి తన పెదవులని ఆనుస్తూ..

కొంతసేపు పోయాక గేటు తీసుకుని బయటికి వచ్చి ఇంటి వైపు నడవసాగాడు ప్రకాశరావు. ఒకటి రెండుసార్లు, వెనక్కి చూశాడు-గేటుదగ్గర కుక్కపిల్లా, విక్టోరియా, నిలబడ్డారు. ఒకటి రెండు వీధులు వెనక్కి వొచ్చాక ఒక వీధి దీపం క్రింద నిలబడి జేబులో నలిగిన రాజీనామా కాగితం తీసి చదివాడు.

తిరిగి వెనక్కి నడిచాడు-మళ్ళా విక్టోరియా ఇంటిముందు నించే. ఆమె గేటుదగ్గర లేదు. అతనక్కడ ఆగనూలేదు. ఈసారి చాలా తొందరగా రాజారావు ఇంటికి దారితీశాడు.

ఈ అవమానంతో తానిక్కడ బ్రతకలేనని అతనికి తెలుసు.